క్లుప్తంగా

సాగర్‌కు న్యాయం జరిగే వరకు ఉద్యమం



నకరికల్లు: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మంచాన పడిన సాగర్ బాబుకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్ పేర్కొన్నారు. సాగర్ కుటుంబ సభ్యులతో కలిసి పలు సంఘాల నాయకులు చేజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చేస్తున్న నిరసన దీక్ష గురువారానికి 20వ రోజుకు చేరుకుంది. న్యాయం చేయాలని కోరుతూ సాగర్ కుటుంబ సభ్యులు, నేతలు ప్లకార్డులు ప్రదర్శించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటానాయక్ మాట్లాడుతూ కొదమగుండ్లలో విద్యుత్ షాక్‌కు గురై శారీరక వైకల్యం పొందిన సాగర్‌బాబును, అతని కుటుంబసభ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, పీడీఎం నాయకులు ప్రసాద్, గిరిజనసంఘం నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

బెల్లంకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలు కారణంగా పాఠశాల మైదానమంతా జలమయమై తరగతి గదులకు వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. మురుగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, కోఆప్షన్ మెంబర్ కావూరి షేక్ దరియా, పార్టీ మండల అధ్యక్షులు అన్నపరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు పీఎస్కే మౌలాలి, గడిపర్తి చిన్నబాబు, బడా బచ్చా, నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతస్థితి



సత్తెనపల్లి: విద్యతోనే సమాజంలో ఉన్నతస్థితికి చేరి మనిషి అభివృద్ధి చెందుతాడని కార్డ్ సంస్థ గుంటూరు డెప్యూటీ డైరెక్టర్ ఆర్.అనిత అన్నారు. సత్తెనపల్లి ఎన్జీవో హోంలో గురువారం నిర్వహించిన బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్తెనపల్లి మండల కోఆర్డినేటర్ కొలకలూరి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ బాలబాట ద్వారా ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటపాటల ద్వారా విద్యను అందించడం, పెరటి తోటల పెంపకం, పచ్చదనం పరిశుభ్రత, స్వయం సహాయక జీవన విధానం అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా డెప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు మాట్లాడుతూ బాలబాట ద్వారా అందిస్తున్న సేవలను పేద వర్గాలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం సత్తెనపల్లి మండలంలోని బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లకు నిత్యావసర సరుకులను సంస్థ డెప్యూటీ డైరెక్టర్ అనిత, సుబ్బారావు అందించారు. కార్యక్రమంలో బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురు అరెస్ట్



పెదకూరపాడు: గాంధీ జయంతి రోజున అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదకూరపాడు, అమరావతి మండలాల్లో సీఐ శ్రీనివాసులుతో పాటు ఎస్ఐ పీరు హుస్సేన్, కానిస్టేబుళ్లు రవికుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు కలిసి మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. అక్కడ అమ్మకాలు జరగలేదని సీఐ శ్రీనివాసులు తెలిపారు. అయితే, అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురిని గుర్తించామని చెప్పారు. దిగుడు గ్రామానికి చెందిన మాబులూరి వీరయ్య వద్ద 20 సీసాలు, లింగాపురానికి చెందిన దూదేకుల చందు వద్ద 10 సీసాలు, ఉంగుటూరు కు చెందిన కంతేటి బ్రహ్మం వద్ద 29 సీసాలతో పాటు ఓ కారును కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పండగ వేళ.. ప్రయాణికులకు పాట్లు

- స్వస్థలాలకు తరలేందుకు అవస్థలు
- కిక్కిరిసిపోతున్న స్త్రీ శక్తి ఆర్టీసీ బస్సులు
- బస్సుల కోసం తప్పని ఎదురుచూపులు



సత్తెనపల్లిలో గుంటూరు బస్సు స్టాపులో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

సత్తెనపల్లి: దసరా సందడి ముగిసింది. పండగ అనగానే ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా సొంతూళ్లకు వచ్చారు. తిరిగి వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. స్త్రీ శక్తి అంటూ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో సమస్యలు వస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కష్టంగా మారింది. నేడు బస్సుల్లో ప్రయాణించేందుకు మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే బస్టాండ్‌లకు క్యూ కడుతున్నారు. బస్సు రాగానే ఎక్కేందుకు పోటీపడుతున్నారు. దీంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. పైగా బస్సుల కొరత కూడా ప్రధాన సమస్యగా మారింది.

పురుషులకు పాట్లు

ఒకవైపు బస్సుల కొరత, మరోవైపు కిక్కిరిసిపోవడంతో పురుషులు ప్రయాణించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పలు మార్గాల్లో తక్కువగా ఉన్నాయి. ప్రయాణికుల్లో ముఖ్యంగా మహిళల శాతం ఎక్కువగా ఉంది. దీంతో హౌస్‌ఫుల్‌గా మారుతున్నాయి. కొన్ని స్టాపుల్లో బస్సులు ఆగడం లేదు. 55 నుంచి 60 సీటర్స్ ఉండే బస్సుల్లో అదనంగా మరో 50 మంది వరకు ఎక్కించడంతో ప్రయాణం నరకంగా మారింది. 100కు పైగానే ప్రయాణికులు బస్సు ఎక్కుతూ దిగుతున్నారు. పలువురు ఫుట్ పాత్ వద్ద వేలాడుతూ ప్రమాదకరస్థితిలో ప్రయాణం సాగిస్తున్నారు. బస్సు ప్రారంభంలోనే ఎక్కువ మంది ప్రయాణికులు నిలిచి ఉంటున్నారు. బస్సు మధ్య భాగానికి, వెనుక భాగానికి వెళ్లమన్నప్పటికీ కదలడం లేదు. డ్రైవర్, కండక్టర్లు ఏదో రకంగా వెనక భాగానికి పంపినా తిరిగి వారు దిగేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఒకవైపు లగేజీ, మరోవైపు అధిక సంఖ్యలో ప్రయాణికులతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణంతో చుక్కలు కన్పిస్తున్నాయి.

పెరిగిన మహిళల సంఖ్య

గతంలో ఏదైనా పని ఉంటేనే మహిళలు ప్రయాణాలు సాగించేవారు. ప్రస్తుతం పని ఉన్న వారు లేనివారు బస్సులెక్కుతున్నారు. మహిళలతో పాటు వృద్ధులు, చంటి పిల్లలు కూడా ఎక్కడంతో సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ఘర్షణలు లేకుండా ప్రయాణం సాగడం లేదు. కొన్ని ప్రధాన రోడ్లలో ప్రయాణించే బస్సుల్లో 75 శాతానికి పైగా మహిళలు కనిపిస్తున్నారు. దీంతో అత్యవసర పని మీద వెళ్లే వారికి ఇబ్బందులు అంతా ఇంతా కాదు. నేడు బస్సు ప్రయాణం కష్టంగా మారింది. పైగా పలు స్టాపుల వద్ద ఆపకుండా బస్సులు వెళ్లిపోతున్నాయి. ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది అన్న చందంగా బస్సు స్టాప్‌లో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉంటున్నారు. బస్సులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.

తిరుగు ప్రయాణానికి అవస్థలు

దసరా పర్వదినం ముగియడంతో తిరుగు ప్రయాణం కష్టంగా మారింది. బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూపులు తప్పడం లేదు. ఉచిత బస్సుల వల్లే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో బస్సులు ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రేపు ఉచిత గుండె వైద్య పరీక్షలు

సత్తెనపల్లి: ఏఆర్ సేవా సదన్ సత్తనపల్లి వారి ఆధ్వర్యంలో మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కేర్ విజయవాడ వారి సౌజన్యంతో సత్తెనపల్లిలోని శరభయ్య గ్రౌండ్ ఎదురు గల ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత మెగా గుండె వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ కార్తిక్ నాయుడు, డాక్టర్ నాగ కిరణ్ సేవలందిస్తారని పేర్కొన్నారు.

రీ సర్వేకు సహకరించండి

పెదకూరపాడు: రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ధనలక్ష్మి కోరారు. పెదకూరపాడు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మొత్తం తొమ్మిది వేల ఎకరాల్లో సర్వే చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం రైతులతో కలిసి గ్రామంలో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు అర్తిమళ్ల రమేష్ బెల్లంకొండ రాంగోపాలరావు వడ్లమూడి అప్పారావు, ఏటుకూరి బ్రహ్మయ్య, మద్దినేని సత్యం, ముంతాజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్నేహహస్తాలు చేయూత



లాప్ టాప్‌లు అందజేస్తున్న తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీపీ స్వర్ణమ్మ బాయి

అచ్చంపేట: విద్యాభివృద్ధికి స్నేహ హస్తాలు ఫౌండేషన్ చూపుతున్న చొరవ అభినందనీయమని తహసీల్దారు ఎస్.చంద్రశేఖర్, ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ బాయి అన్నారు. ఇద్దరు పేద ఇంజినీరింగ్ విద్యార్థులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ నిర్వాహకులు గురువారం అచ్చంపేటలో లాప్‌టాప్‌లు, ఆర్థిక సహాయం అందజేశారు. గుంటూరు కిట్స్‌లో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న రాజవరపు లక్ష్మీప్రసన్నకు హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.35వేలు, ప్రాజెక్టు వర్క్ నిమిత్తం రూ.40వేలు విలువచేసే లాప్ టాప్ అందించారు. గుంటూరు చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న కొత్తమాసు రోహితకు ప్రాజెక్టు వర్క్ నిమిత్తం రూ.40వేలు విలువచేసే లాప్‌టాప్‌ను అందజేశారు.పేద విద్యార్థులకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఇస్తున్న భరోసా అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి తాయి కరీముల్లాబాబు, సభ్యులు మన్నెం భద్రయ్య పాల్గొన్నారు.

కళాకారుడు రాంబాబుకు పురస్కారం ప్రదానం



రాంబాబును సత్కరిస్తున్న పాములయ్య, రమాదేవి తదితరులు

సత్తెనపల్లి: పట్టణంలోని వాల్మీకినగర్‌లో సరికొండ లచ్చరాజు మెమోరియల్ సాహితీ కళావేదిక తొలి పురస్కారాన్ని పట్టణానికి చెందిన పరిషత్ కళాకారుడు, నంది అవార్డు గ్రహీత, ఏపీ ప్రజానాట్య మండలి నియోజకవర్గ అధ్యక్షుడు ముట్టే రాంబాబు అందుకున్నారు. సత్తెనపల్లికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు, రచయిత్రి సరికొండ రమాదేవి తన తండ్రి పేరుతో లచ్చరాజు మెమోరియల్ సాహితీ కళావేదికను గురువారం సీనియర్ న్యాయవాది, ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఏటా విజయదశమి నాడు కళా, సాహిత్య రంగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు ఈ అవార్డును అందించనున్నట్లు నిర్వాహకురాలు రమాదేవి తెలిపారు. తొలిసారిగా పురస్కారాన్ని ముట్టే రాంబాబు అందుకున్నారు. ఆయనకు జ్ఞాపికతో పాటు రూ. 1,116ను అందజేసి ఘనంగా సత్కరించారు. యువ ఫొటోగ్రాఫర్ పిన్నమనేని భాను ప్రకాష్‌కు ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపిక అందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు, సత్యనారాయణ, రాజు, మాతంగి సాంబశివరావు, ధారా లూర్దయ్య, దారా జాషువా, ఈవీ ప్రసాదరావు, కాటుమాల నాగేశ్వరరావు, అనుపమ ఖేర్, సిద్ధార్థ శ్రీనివాస్, ఆంజనేయులు, గుర్రం వెంకటేశ్వర్లు, కోంద్రు హనుమంతరావు పాల్గొన్నారు.

మహాత్మా.. ఓ మహర్షి !



పట్టణంలోని సబ్‌జైలు ఎదుట గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, నాయకులు

సత్తెనపల్లి: సత్యం, సామరస్యం, సమానత్వం అనే మూడు సిద్ధాంతాలతో మహాత్ముడి జీవితం గడిచిందని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, గాంధీ చౌక్, సబ్ జైలు ఎదుట ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌక్‌లో గురువారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాసవీ సేవా సమితి అధ్యక్షుడు దేవరశెట్టి రవికుమార్, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.
- లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ జైలులో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖైదీలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బండ్లమూడి వీరాంజనేయులు, సబ్‌జైలు సూపరింటెంట్ వెంకటరత్నం పాల్గొన్నారు.
- నందిగామలో సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్ (చెత్త నుండి సంపద తయారీ కేంద్రం) వద్ద గాంధీ విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి గురువారం ఆవిష్కరించారు. విగ్రహ దాత పోతుగంటి నరసింహారావు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం పంపిణీ

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లిలో ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జూపల్లి మోషె, చింతపల్లి ఫకీర్ అహ్మద్ పాల్గొన్నారు.

లాల్ బహుదూర్‌కు ఘన నివాళి

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో లాల్ బహుదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాంధీ మార్గం ఆచరణీయం

నకరికల్లు : మహాత్మాగాంధీ చూపిన మార్గం ఆచరణీయం, ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు బైరెడ్డి పరమేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీబాషా, సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాలూరి రాజశేఖర్‌రెడ్డి, సలీల్, మద్దం సురేష్, పాశం పాపిరెడ్డి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి పూలమాలలు

అమరావతి: స్థానిక గాంధీ బొమ్మ సెంటరులోని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు ఆలా లక్ష్మీనారాయణ, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, పెదకూరపాడు నియోజకవర్గ డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు షేక్ షరీఫ్, నాయకులు పాపారావు పాల్గొన్నారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి

బెల్లంకొండ: అహింసా మార్గం ద్వారా మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన జాతిపిత మహాత్మా గాంధీజీ అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరూ నడవాలని ఎంపీడీవో సునీత తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి ఎంపీడీవో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో తహసీల్దార్ ప్రవీణ్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జన చైతన్య సమితి ఆధ్వర్యంలో ..

పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల కారుణ్య వృద్ధాశ్రమం, పెదకూరపాడులో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు



ర్యాలీలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు, ఏవో శ్రీధర్‌రెడ్డి తదితరులు



పట్టణంలో చేపట్టిన ప్రదర్శనలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు పలు ప్రయోజనాలు

మాదల(ముప్పాళ్ల): రైతులకు తగ్గిన జీఎస్టీ ఎంతో లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు చెప్పారు. మండలంలోని మాదలలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. జగ్గారావు మాట్లాడుతూ రైతులు వినియోగించే మినీ ట్రాక్టర్లు, రోటీవేటర్లు, పవర్‌టిల్లర్లు, బయో పురుగు మందులు, సూక్ష్మ పోషకాలతో పాటు సూక్ష్మ సేద్యం పరికరాల కొనుగోలుపై కూడా 12శాతం నుంచి 5శాతానికి జీఎస్టీని తగ్గించారని తెలిపారు. సత్తెనపల్లి వ్యవసాయశాఖ ఏడీఏ బి.రవిబాబు మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీ వల్ల వ్యవసాయ రంగానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ తిరుమలశెట్టి సైదుబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు పోలిరాజు, టీడీపీ నాయకులు బత్తుల నాగేశ్వరరావు, ఏఈఓ శేషుబాబు, నీలిమ, పంచాయతీ కార్యదర్శి శివాజీ పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

మండలంలోని 75 తాళ్లూరు, కంభంపాడు, జలాలపురం, కాసిపాడు, హుస్సేన్ నగరం గ్రామాల్లో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. వ్యవసాయ అధికారి డి. కృష్ణయ్య, జీఎస్టీ అధికారి స్మిత్నర్, వై. రత్నకుమార్, 75 తాళ్లూరు సొసైటీ అధ్యక్షులు వి. అప్పారావు, నీటి సంఘాల చైర్మన్ ఏటుకూరి బ్రహ్మయ్య, సొసైటీ డైరెక్టర్స్ భాష్యం ఆంజనేయులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

రైతులు వినియోగించే యంత్ర పరికరాలపై జీఎస్టీ తగ్గిందని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి. సుబ్బారెడ్డి అన్నారు.సత్తెనపల్లి మండల స్థాయిలో నందిగామలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. కొత్త జీఎస్టీతో రైతులు ఉపయోగించే వివిధ రకాల యంత్ర పరికరాలతో పాటు సూక్ష్మ పోషకాల ధరలు తగ్గాయని తెలిపారు. కార్యక్రమంలో నందిగామ పంచాయతీ సెక్రటరీలు కుంభ వెంకటేశ్వర్లు, చిలుకూరి కృష్ణప్రసాద్, వీఏఏలులు రేష్మ, భార్గవి, రైతులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: జీఎస్టీ తగ్గింపుతో ప్రజల తలసరి ఆదాయం మెరుగుపడుతుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్‌లో వాణిజ్య దుకాణాలను శుక్రవారం ఆయన సందర్శించారు. జీఎస్టీ తగ్గింపుపై వ్యాపారులకు, వినియోగ దారులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ 2.0తో కుటుంబానికి నెలకు రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు ఆదా అవుతుందని తెలిపారు. వ్యాపారుల ఇబ్బందులు, వసూళ్లలో తేడాలపై ఆయన ఆరా తీశారు. జీఎస్టీ తగ్గింపు వ్యాపార వర్గాలకు ఊరటనిస్తోందని పేర్కొన్నారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్‌కుమార్, నాయకులు దరువూరి నాగేశ్వరరావు ఉన్నారు.

ఖడ్గ ధారిణి.. చండీ దుర్గాదేవి నమోస్తుతే !



బెల్లంకొండలో రాజరాజేశ్వరీ దేవిగా..



సత్తెనపల్లిలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో వాసవీ మాత



పెదకూరపాడు బొమ్మల గుడి వద్ద దుర్గాదేవిగా..

దసరా సరదాలు గ్రామాల్లో సందడిగా సాగాయి. పలు గ్రామాల్లో కొలువుదీరిన అమ్మవారు పండుగ నాడు దుర్గాదేవిగా, రాజరాజేశ్వరీదేవిగా. భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి శోభాయాత్ర అత్యంతవైభవంగా నిర్వహించారు. మేళ తాళాలు, భారీ బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఊరేగింపులు సందడిగా సాగాయి.

-పెదకూరపాడు/అచ్చంపేట/ క్రోసూరు/ముప్పాళ్ల/ సత్తెనపల్లి/బెల్లంకొండ



అచ్చంపేట వాసవీ మాత ఆలయంలో కాళికాదేవిగా..



గోళ్లపాడులో ప్రత్యేక అలంకరంలో దుర్గాదేవి



అనంతవరంలో రాజేరాజేశ్వరీ దేవీగా..



సత్తెనపల్లి త్రిశక్తి దుర్గాపీఠంలో రాజరాజేశ్వరీదేవిగా..

వస్త్ర వ్యాపారులను కలిసిన సుధీర్ భార్గవ్‌రెడ్డి



భార్గవ్‌రెడ్డిని సత్కరిస్తున్న సుబ్రహ్మణ్యం

సత్తెనపల్లి: పట్టణంలో ప్రముఖ వస్త్ర వ్యాపారులైన భవిరిశెట్టి సుబ్రహ్మణ్యం, భవిరిశెట్టి శ్రీనివాసరావులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ఇద్దరూ సాదరంగా ఆహ్వానించారు. కొద్దిసేపు ఏకాంతంగా సమాలోచనలు చేశారు. అనంతరం వారు సుధీర్ భార్గవరెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.